క్లుప్తంగా

రైతు సమస్యలపై ప్రశ్నిస్తే వ్యక్తిగత విమర్శలా?



మాట్లాడుతున్న కందుల శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: రైతులు పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు అవస్థలు పడుతున్న విషయమై ప్రశ్నించిన తమ నాయకుడు గొట్టిముక్కల సురేశ్‌రెడ్డిపై వ్యక్తిగత విమర్శలకు దిగడం సరికాదని బీజేపీ సుల్తానాబాద్ మండల అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ అన్నారు. పెద్దపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన రైతులు, పార్టీ నేతలతో కలిసి మాట్లాడారు. ప్రజా, రైతాంగ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి ప్రతిపక్షనేతగా సురేశ్‌రెడ్డి పాటుపడుతుంటే ఓర్వలేకపోతున్నారన్నారు. ఎమ్మెల్యే తన అనుచరులతో విమర్శలు చేయించకుండా ధాన్యం కొనుగోళ్లపై, వాస్తవ పరిస్థితులపై దృష్టిసారించాలన్నారు. రైతులు ఆసరి ఎర్రయ్య, భాస్కర్‌రెడ్డి, నాయకులు తీగల అశోక్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్, కుమార్, సంపత్, అనిల్, వేణు ఉన్నారు.

మంత్రిపై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



మాట్లాడుతున్న మంథని సత్యం

మంథని: పార్లమెంట్ ఎన్నికల్లో అన్నీ తానై ఎంతో కష్టపడి పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీకృష్ణను గెలిపిస్తే మంత్రి శ్రీధర్‌బాబుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని ఎస్సీ సెల్ మంథని మండల అధ్యక్షుడు మంథని రాకేశ్, డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం అన్నారు. మంథనిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈనెల 15న మంథని నియోజకవర్గంలోని కాళేశ్వరం దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎంపీ ఫొటో లేదని మంత్రి శ్రీధర్‌బాబు, దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్‌పై ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. ఎంపీగా ఆయన చేసిన అభివృద్ధిపై మాట్లాడాలని, ఆ వర్గాలకు ఆయన చేసిన మేలు ఏంటో చెప్పాలన్నారు. నాయకులు చంద్రు రాయమల్లు, బూడిద తిరుపతి, తోకల మల్లేశ్, నాగెల్లి జానీ, ఎరుకల మధు, అర్ల నారాయణ, కన్నూరి బాపు, రొడ్డ రాజేశ్వర రావు, అక్కపాక సదయ్య, మంథని కిష్టయ్య, బూడిద రంజిత్, జనగామ కృష్ణ, దొరగొర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువత సమాజసేవలో ముందుండాలి



సన్మానిస్తున్న అభిషేక్‌రావు, కాలనీవాసులు

జ్యోతినగర్: యువత సమాజ సేవలో ముందుండాలని రామగుండం కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు అన్నారు. ఎన్టీపీసీ రామగుండం ప్రాంతంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో శ్రీభగవతి యూత్ సర్వసభ్య సమావేశంలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. వేసవిలో ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్‌లో చలివేంద్రం ఏర్పాటు చేసి తాగునీరు అందిస్తున్న శ్రీ భగవతి యూత్ సభ్యులను అభినందించారు. అనంతరం శ్రీభగవతి యూత్ కొత్త కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా కంకటి రవిగౌడ్, ఉపాధ్యక్షులుగా మామిడాల గణేశ్, ఇలియాస్ బేగ్, కాంతం సాయినాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పైడ సాయి, కోశాధికారులుగా బత్తిని చంద్రశేఖర్ గౌడ్, బుద్దె సతీశ్‌తో పాటు పలువురిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కొత్త అధ్యక్షుడు రవి గౌడ్‌ను సన్మానించారు. సాగర్ రావు, మాచిడి మహేందర్‌గౌడ్, శ్రీనివాస్, తిరుపతి, వొల్లాల సురేశ్, ఆడెపు పరంధాములు, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

చేతిపంపులకు మరమ్మతు



యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం ముస్త్యాలలోని ఎస్సీ కాలనీలో రెండు చేతి పంపు బోర్లు పనిచేయకపోవడంతో కాలనీవాసులు తాగునీటి సమస్య ఉందని కాంగ్రెస్ జిల్లా మహిళా వైస్ ప్రెసిడెంట్, గ్రామ మాజీ సర్పంచ్ లావణ్యకు తెలిపారు. వెంటనే స్పందించిన లావణ్య బోర్ మెకానిక్‌ను పిలిపించి బోర్లకు మరమ్మతు చేయించారు. కాలనీ వాసులు ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు.

కొత్త రోడ్డు.. ఇంకెప్పుడు?



రోడ్డుపై ఏర్పడిన గుంతలు

జ్యోతినగర్: 'సార్లు రోడ్డు ఎప్పుడు వేస్తారు. నిధులు మంజూరయ్యాయి అన్నారు. నెల రోజులు కావస్తుంది. ఇంకా ఎప్పుడు వేస్తారు. ఇక వర్షాలు ప్రారంభమైతే రోడ్డు వేయడం కష్టంగా ఉంటుంది' అని ప్రజలు చర్చించుకుంటున్నారు. గత నెల 16న రాజీవ్ రహదారి ఎన్టీపీసీ హెలిప్యాడ్ వాటర్ ట్యాంకు నుంచి నర్రాశాలపల్లె వరకు రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారిందని వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని 'సాక్షి'లో 'కంకర తేలి.. గుంతలు ఏర్పడి' అనే కథనం ప్రచురితమైంది. కథనం ప్రచురితమైన రోజున కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పందించారు. రాజీవ్ రహదారి ఎన్టీపీసీ హెలిప్యాడ్ ట్యాంక్ నుంచి నర్రశాలపల్లి ప్రభుత్వ పాఠశాల వరకు రూ2.00 కోట్ల అంచనా వ్యయంతో సీసీరోడ్డు నిర్మించడానికి పాలనాపరమైన ఆమోదం తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు జారీ చేసి నెలరోజులైనా ఇంకా కొత్త రోడ్డుకు మోక్షం ఎప్పుడు వస్తుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు. త్వరగా రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

- టీజీఎన్‌పీడీసీఎల్ పరిధిలో అంతర్గాం మండలానికి మూడో ర్యాంకు

రామగుండం: రాష్ట్ర నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీజీఎన్‌పీడీసీఎల్) పరిధిలోని 16 జిల్లాల్లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన విద్యుత్ సేవలు అందించిన ఇంజనీర్ల పని తనానికి కొలమానంగా వరంగల్ ఎన్‌పీడీసీఎల్ సీఎండ్‌ఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఈనెల 15వ తేదీన ర్యాంకులు ప్రకటించారు. ఇందులో భాగంగా అంతర్గాం మండలానికి మూడో ర్యాంకు రావడంపై స్థానిక విద్యుత్ ఉద్యోగుల్లో హర్షం వ్యక్తం అవుతోంది.

ర్యాంకుల సాధనలో పరిగణనలోకి తీసుకున్న అంశాలు..

- అంతర్గాం విద్యుత్ కార్యాలయ పరిధిలో ప్రతీ నెల రూ.44లక్షల బిల్లుల వసూళ్ల లక్ష్యం పూర్తి చేయడం.
- ప్రధానంగా విద్యుత్ చౌర్యాన్ని గుర్తించి అరికట్టడం, ప్రతీ నెల రావాల్సిన బిల్లుల కలెక్షన్‌కు సమానంగా విద్యుత్ వినియోగం, విద్యుత్ సరఫరా సాఫీగా జరగడం.
- విద్యుత్ వినియోగదారుల సమస్యలు స్వీకరించడం, మీటర్లలోని లోపాలను సరిచేయడం, కాలిపోయిన మీటర్ల స్థానంలో నూతన మీటర్లను అమర్చడం.



ఆకెనపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్

- విద్యుత్ బ్రేక్ డౌన్స్ నియంత్రించడం, ప్రతీరోజు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ, కాలిపోకుండా జాగ్రత్తలు పాటించడం.
- వ్యవసాయ కనెక్షన్లకు అంచనాలు సిద్ధం చేయడం, నూతన లైన్లు వేసి ట్రాన్స్‌ఫార్మర్లు బిగించడం, రైతాంగ విద్యుత్ సమస్యలు పరిష్కరించడం.
- టీఎస్‌ఐపాస్‌లో భాగంగా నూతన పరిశ్రమ స్థాపనకు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి నిర్దేశిత గడువులోగా విద్యుత్ సరఫరా చేయడం.
- నూతన మీటర్ల కోసం వినియోగదారులు మీసేవలో దరఖాస్తు చేసుకున్న రెండు రోజుల్లోనే కనెక్షన్ ఇవ్వడం.
- సంస్థకు సంబంధించిన వర్క్ ఆర్డర్స్ పెండింగ్ లేకుండా చూసుకోవడం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు.
- అంతర్గాం కార్యాలయ పరిధిలో మొత్తం విద్యుత్ కనెక్షన్ల సంఖ్య 7,484 కాగా 621 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి.

సమష్టి కృషితోనే ర్యాంకు



మా కార్యాలయంలోని సిబ్బంది నిత్యం క్షేత్రస్థాయిలో వినియోగదారులు ఎదుర్కొనే సమస్యలు సత్వరమే పరిష్కరించడం, అధికారికంగా ధృవీకరించడం తదితర సమష్టి కృషితోనే ఎన్‌పీడీసీఎల్ పరిధిలో మూడో ర్యాంకు కైవసం చేసుకున్నాం. మండలానికి వచ్చిన ర్యాంకులో నా తోటి ఉద్యోగులతో పాటు మాకు సహకరించిన విద్యుత్ వినియోగదారుల సహకారం ప్రతీ ఒక్కరి భాగస్వామ్యంతో ర్యాంకు సాధ్యమైంది.

– ఆశ శంకర్, ఏఈ, అంతర్గాం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ధర్మారం: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



ముత్తారం: వేదికపై పూర్వ విద్యార్థులు



పాలకుర్తి: కుక్కలగూడుర్ పూర్వ విద్యార్థులు

ధర్మారం: మండలంలోని నందిమేడారం ఉన్నత పాఠశాలలో 33ఏళ్ల క్రితం చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ పాఠశాలలో 1992–93లో పదో తరగతి చదివిన వారంతా కుటుంబ సమేతంగా హాజరయ్యారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమ నిర్వాహకులుగా మామిడిశెట్టి శ్రీనివాస్, వేల్పుల మల్లేశం, బద్దం మల్లారెడ్డి, సురకంటి లడ్డు తిరుపతిరెడ్డి, పాలకుర్తి వెంకటేశ్‌గౌడ్, తిరుపతిగౌడ్ వ్యవహరించారు.

ముత్తారంలో..

ముత్తారం: ముత్తారం జెడ్పీ పాఠశాలలో 2008–2009లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అప్పటి గురువులను సన్మానించి జ్ఞాపికలు బహూకరించారు.

కుక్కలగూడుర్‌లో..

పాలకుర్తి: మండలంలోని కుక్కలగూడుర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995 నుంచి 2006 వరకు పదో తరగతి చదివిన విద్యార్థులంతా ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబోధన చేసిన గురువులను సన్మానించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. పూర్వ హెడ్‌మాస్టర్ ఐలయ్య, ఉపాధ్యాయులు అశోక్‌రెడ్డి, సారంగపాణి, ఉమారాణి, సుచిత్ర, సుజాత, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• అందుబాటులో జీలుగ విత్తనాలు

మంథని: మంథనిలోని రైతుసేవా కేంద్రాల్లో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మంథని వ్యవసాయ సహాయ సంచాలకులు అంజనీ తెలిపారు. 30 కిలోల జీలుగ విత్తనాల బస్తాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కిలో జీలుగులు రూ.142.5 కాగా ప్రభుత్వం 50శాతం సబ్సిడీపోను రూ.71.25 చెల్లించాలని పేర్కొన్నారు. 30కిలోల బస్తాకు రూ.2,137.50 అని, రెండున్నర ఎకరాలకు 30 కిలోల బస్తా సరిపోతుందన్నారు. వివరాలకు స్థానిక వ్యవసాయ అధికారిని సంప్రదించాలని సూచించారు.

• సుల్తానాబాద్‌లో జనుము, జీలుగ విత్తనాలు

సుల్తానాబాద్: సుల్తానాబాద్ సింగిల్‌విండోలో సబ్సిడీ ద్వారా జనుము, జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, కార్యదర్శి బూరుగు సంతోష్‌కుమార్ తెలిపారు. ఈనెల 19న రైతులందరికీ అందుబాటులో ఉండి పంపిణీ చేయనున్నారని తెలిపారు. కావాల్సిన రైతులు ఆధార్‌కార్డు జిరాక్స్, పట్టాదార్ పాస్‌బుక్ జిరాక్స్ తీసుకురావాలని సూచించారు.

• ఓదెల మండలంలో..

ఓదెల: మండలంలోని రైతులకు అందుబాటులో 50శాతం రాయితీపై జీలుగ, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి భాస్కర్ ఆదివారం తెలిపారు. కావాల్సిన రైతులు డీసీఎంఎస్ పొత్కపల్లి, ఓదెల, ఆగ్రోస్ కనగర్తిలో విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, రైతులు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌లు తీసుకువచ్చి విత్తనాలను పొందవచ్చని పేర్కొన్నారు.

• పాలకుర్తి మండలం రైతులకు..

పాలకుర్తి: మండల పరిధిలోని గ్రామాల రైతులకు మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పుట్నూర్ గ్రామంలోని డీసీఎంఎస్ గోదాం పాయింట్ వద్ద ఉదయం 9గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాన్ని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు అందజేస్తారని ఏవో ప్రమోద్ వివరించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

• ఎన్టీపీసీ ప్లాంటులో ప్రమాదం.. ఒకరికి గాయాలు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. తెలంగాణ ప్రాజెక్టులోని సంఘ కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్న ఒడిశాకు చెందిన కాంట్రాక్టు కార్మికుడు తహర్ దుర్గ ఎలక్ట్రికల్ వాహనంపై కొత్త ప్లాంటు నుంచి పాత ప్లాంటులో ఉన్న కొత్త ప్రాజెక్టు కూలింగ్ టవర్ల వద్దకు శనివారం రాత్రి సామగ్రి తీసుకెళ్తున్నారు. కాగా ప్రమాదవశాత్తు ఎలక్ట్రికల్ వాహనం అదుపుతప్పి సైడ్ కాలువలో పడిపోయింది. వాహనంలో ఉన్న దుర్గ రెండు కాళ్లకు తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం గోదావరిఖనిలో ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు.

• పేకాటరాయుళ్లపై కేసు

మంథని: మండలంలోని గాజులపల్లి గ్రామ శివారులోని ఖాళీ స్థలంలో పేకాట ఆడుతున్న వారిని పట్టుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. ఆరుగురు పట్టుబడినట్లు పేర్కొన్నారు.

• నాటుసారా పట్టివేత

పెద్దపల్లిరూరల్: ఎక్సైజ్ ప్రొహిబిషన్ అధికారులు శనివారం రాత్రి తనిఖీలు నిర్వహిస్తుండగా బైక్‌పై నాటుసారా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు నాగేశ్వర్‌రావు, జీవన్‌రెడ్డి తెలిపారు. తమ సిబ్బందితో కలిసి నిట్టూరు మీదుగా జూలపల్లి శివారులో వాహన తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో ధర్మారం మండలం కమ్మర్‌ఖాన్‌పేటకు చెందిన వ్యక్తి వద్ద 4లీటర్ల నాటుసారాయి లభ్యం కావడంతో వాహనాన్ని, నాటుసారాయిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. సిబ్బంది కృష్ణ, వనిత, సంతోష్, శ్రీనాథ్ ఉన్నారు.

• ఉచిత వైద్య శిబిరం

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ 23వ డివిజన్ సుభాష్‌నగర్‌లో కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డివిజన్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే సతీమణి మనాలి ఠాకూర్, ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్‌కిరణ్ ప్రారంభించారు. మెడికవర్ ఆస్పత్రి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ నాగరాజు, డీఎంవో డాక్టర్ హర్షిత్ అవసరమైన వారికి షుగర్, బీపీ, 2డి ఎకో పరీక్షలు చేశారు. మెడికవర్ ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మహేశ్, రమేశ్, యాదగిరి, ప్రకాశ్, ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్ కరుణాకర్, హరీశ్, యూనస్ పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా రమేశ్



ఏకగ్రీవంగా ఎన్నికైన కార్యవర్గం

సుల్తానాబాద్: సుల్తానాబాద్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అయిల రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వాకర్స్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. గౌరవ అధ్యక్షులుగా అమిరిశెట్టి రాజలింగం, బైరబోని రవీందర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా పల్ల సురేశ్, ఎనగందుల ఎల్లయ్య, చొప్పరి సుమన్, కందునూరి కుమార్, ఎలగందుల మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా మంద శ్రీనివాస్‌గౌడ్, సహాయ కార్యదర్శులుగా పల్ల శ్రీనివాస్, ఎలిగేటి రమేశ్, కొలిపాక రవీందర్, ఆఖరి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా శ్రీకాంత్, సుమన్, ఆర్థిక కార్యదర్శిగా వేణు, లీగల్ అడ్వైజర్‌గా ఆకారపు సర్వోత్తమ్‌రెడ్డి, కోడెం అజయ్, సత్యనారాయణ, ఆవుల శివ, కోచ్‌గా గెల్లు మధుకర్, ముఖ్య సలహాదారులుగా రాజేంద్రప్రసాద్, భాస్కర్, సుగుణాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఏడాదిపాటు పదవీకాలం ఉంటుందని ఎన్నికల అధికారిగా వ్యవహరించిన రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో కుంకుమ పూజలు



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని పిల్లిపల్లెలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మతల్లి ప్రతిష్ఠాపన ఉత్సవాలు వేదపండితులు గడియారం సత్యనారాయణ శర్మ, మనోజ్ శర్మ, వేణు శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం పెద్దమ్మ విగ్రహ జలదివాసం, ధాన్యాదివాసం, పుష్పదివాసం, ఫలదివాసం, కుంకుమ పూజలు, హోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై వివిధ పూజల్లో పాల్గొన్నారు.



ముత్తారం: మండలంలోని అడవిశ్రీరాంపూర్ ప్రాథమిక పాఠశాలలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వరి గడ్డి నిల్వ చేశాడు. పాఠశాలలో సమ్మర్ క్యాంపునకు విద్యార్థులు హాజరవుతున్నారు. పాఠశాలలో వరి గడ్డి నిల్వ చేయడంతో పాముల భయంతో విద్యార్థులకు భయాందోళనకు గురవుతున్నారని స్థానికులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలలోని నిల్వ చేసిన వరిగడ్డిని తొలిగించాలని స్థానికులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ పురవీధుల గుండా ఆదివారం హనుమాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. కాలనీ శ్రీహనుమాన్ ఆలయం నుంచి శోభాయాత్ర ప్రారంభించారు. కోలాట మహిళా బృందాలతో వివేకానంద చౌరస్తా మీదుగా షాపింగ్ కాంప్లెక్స్ చౌరస్తా నుంచి షిర్కె బస్టాప్ నుంచి తెలంగాణ చౌరస్తా వరకు శోభాయాత్ర కొనసాగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వీర హనుమాన్ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని చిన్నకల్వల గ్రామంలోని శ్రీసీతారామచంద్రస్వామి, సంకట విమోచన రామభక్త వీర మనుమాన్ బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 22 వరకు ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 19న ప్రబంధ పారాయణం, పరమపదోత్సవం, తీర్థప్రసాద గోష్టి, 20న శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణోత్సవం, యాగశాల ప్రవేశం, 21న సీతారామచంద్రస్వామి సామ్రాజ్య పట్టాభిషేకం, బలిహరణం, 22న గురువారం హనుమాన్ జయంతి మన్యుసూక్త అభిషేకం, ఆకుపూజ, పూర్ణాహుతి, చక్రస్నానం, పుష్పయాగం తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం చలువ పందిళ్లతో పాటు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు సుగుణాకర్ రావు తెలిపారు.

బూడిద పైపు పగిలితే సమాచారం అందించండి



బూడిద పైపులైన్ వద్ద అధికారుల సెల్ నెంబర్లు

రామగుండం: ఎన్టీపీసీ విద్యుత్ కేంద్రం నుంచి వెలువడే బూడిదను భారీ పైపుల ద్వారా అక్బర్‌నగర్ సమీపంలోని యాష్‌పాండ్‌లో డంపింగ్ చేస్తారు. ఇటీవల అక్బర్‌నగర్ సమీపంలో బూడిద పైపు పగిలి పలు ఇళ్లను ముంచెత్తిన విషయం తెలిసిందే. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా బూడిద పైపు లీకేజీ అయినా, బూడిద బయటకు చిమ్మినా అత్యవసరంగా సదరు సెల్ నెంబర్లకు సమాచారం అందించాలని ఎన్టీపీసీ అధి కారులు పైపులైన్ల వద్ద నంబర్లు ఏర్పాటు చేశారు.

ఎన్టీపీసీలో యువకుల హల్‌చల్


జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాంతంలోని ఓ సెంటర్‌లో గోదావరిఖనికి చెందిన ప్రముఖ నాయకుడి అనుచరులు హల్‌చల్ చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే బుధవారం రాత్రి సమయంలో ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి సెంటర్ ప్రాంతంలో ఎన్టీపీసీ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా ట్రిపుల్ రైడింగ్ చేస్తున్న వాహనాన్ని పోలీసులు నిలిపివేశారు. దీంతో సదరు యువకులు పోలీసులతో దురుసుగా ప్రవర్తించినట్లు తెలుస్తోంది. సదరు యువకులు 'ఖని' ప్రాంతానికి చెందిన ఓ నాయకుడి అనుచరులుగా సమాచారం.

అదుపులోకి తీసుకున్నాం

మేడిపల్లి రోడ్‌లో బుధవారం రాత్రి వివాహ ఊరేగింపులో వివాదం జరిగిందనే సమాచారంతో పోలీసు సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లాం. అక్కడ జరిగిన విషయాలు తెలుసుకుని డీజే సౌండ్ సిస్టంను అక్కడి నుంచి స్టేషన్‌కు తరలించాం. అనంతరం రోడ్డుపై వాహనాల తనిఖీ చేపట్టాం. ఈ క్రమంలో ముగ్గురు వ్యక్తులు ట్రిపుల్ రైడింగ్ చేస్తుండగా వారిని నిలపగా వారు దురుసుగా ప్రవర్తించారు. దురుసుగా ప్రవర్తించిన వారు ఎంతటి వారైనా చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం.

– టి.ఉదయ్‌కిరణ్, ఎస్సై, ఎన్టీపీసీ

లంచం అడిగితే ఏసీబీకి ఫిర్యాదు చేయండి



బల్దియా ఏర్పాటు చేసిన ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్లు

కోల్‌సిటీ: ఎవరైనా లంచం అడిగితే అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని రామగుండం నగరపాలక సంస్థ అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), కమిషనర్ జె.అరుణశ్రీ సూచించారు. ఎలాంటి అక్రమాలకు, అవినీతికి తావు లేకుండా రామగుండం నగరపాలక సంస్థ అన్ని సేవలు అందిస్తుందని కమిషనర్ పేర్కొన్నారు. నిర్ణీత వ్యవధిలోనే ఫిర్యాదుల పరిష్కారం, ధృవీకరణ పత్రాల జారీ తదితర అన్నిరకాల సేవలు సామాన్య ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది నిజాయతీగా, సమర్థవంతంగా సేవలందిస్తున్నప్పటికీ.. ఏమైనా లోపాలు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అవినీతి నిరోధకశాఖ టోల్ ఫ్రీ నంబర్ 1064, మొబైల్ నంబర్ 94404 46106 అందరికీ తెలిసేలా బల్దియా కార్యాలయంలో పలు చోట్ల బోర్డులు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. నగర పౌరులకు సుపరిపాలన అందించడానికి ప్రతీ ఒక్కరు సహకరించాలని ఆమె కోరారు.